లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి సాంబశివ రావు

పెండింగ్ కేసులు పరిష్కారం

చేవెళ్లటౌన్, డిసెంబర్ 9: లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ పెండింగ్ కేసులను 9 నుంచి 14వ తేదీ వరకు పరిష్కరించనున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ 66 కేసులు పరిష్కరించగా రూ.1,34,000 జరిమాన విధించినట్లు తెలిపారు. అనంతరం రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ బాలాజీ, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు, డిసెంబర్ 9: అంతర్జాతీయ కరాటే పోటీల్లో మండల కేంద్రానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో పోటీల్లో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన సోను కరాటే అకాడమీ చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ సోను తెలిపారు. ఈ పోటీల్లో ప్రణవి, దీక్షిత, శ్రవంతి, పింకి, అరుణ, ఆస్మిక, ఇందు, పల్లవి, గాయత్రి, నిహారిక, జశ్విక బంగారు పతకాలు సాధించిగా వైశాలి, ఆశ్విని, సిల్వర్ పతకాలు సాధించినట్లు మాస్టర్ సోను తెలిపారు.

ప్రభుత్వ సెలవుల్లో సర్వేకు
మినహాయింపు ఇవ్వాలి

సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మంచాల, డిసెంబర్ 9: పంచాయతీ కార్యదర్శులకు ప్రాథమిక విధులు కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన పని చేయిస్తున్నందున తగిన పారితోషికంతో పాటు ప్రభుత్వ సెలవురోజుల్లో కూడా సర్వే చేయించడం తగదని పంచాయతీ కార్యదర్శి అన్నారు. సోమవారం మంచాల మండలం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులు, అనర్హులను గుర్తించే బాధ్యత కేవలం పంచాయతీ కార్యదర్శులకు కాకుండా ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ప్రభుత్వం సర్వే చేసిన ప్రతి పనిని ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశాలు ఇస్తున్నందున ప్రతి పంచాయతీ కార్యదర్శికి ఒక్కో ట్యాబ్‌ను ఇచ్చినట్లైతే సమయానికి పని పూర్తి చేయడం సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగప్ప, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు తదితర కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్ సర్వీసును నడిపించండి

డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మంచాల, డిసెంబర్ 9: ఆరుట్ల నుంచి చౌటుప్పల్ వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును తిప్పాయిగూడ గ్రామం మీదుగా నడిపించాలంటూ సోమవారం మంచాల మండల పరిధిలోని తిప్పాయిగూడ గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నుంచి రాచకొండ, శివాలయం, సరళమైసమ్మ దేవాలయానికి వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ తిప్పాయిగూడ గ్రామం నుంచే వెళుతుంటారని, ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సును ఉదయం, సాయంత్రం నడిపించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు నర్సింహ, యాదయ్య, సుధాకర్, ప్రభాకర్, ఐలయ్య పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

మాడ్గుల, డిసెంబర్9: మండలంలోని ఇర్విన్ గ్రామ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న స్కూల్ విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. చిన్న చిన్న గాయాలు అయినట్లు ప్రయాణికులు తెలిపారు. ఇబ్రహింపట్నం డిపోకు చెందిన బస్సు చారకొండకు బయలుదేరుతుండా ఘటన జరిగినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ పొలంలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

విద్యార్థులు గణితంలో రాణించాలి

మొయినాబాద్ : హిమాయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు, డిసెంబర్ 9: గణితంలో విద్యార్థులు మెళుకువలు నేర్చుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని మండల విద్యాధికారి పగిడిపాల పాండు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి గణిత పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఇంగ్లిష్ మీడియం విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీవల్లి మొదటి స్థానంలో నిలవగా, జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి దేవదాస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. కేజీబీవీ విద్యార్థి నందిని తృతీయ స్థానంలో నిలిచింది. అదే విధంగా తెలుగు మీడియంలో జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులైన పూజ మొదటి స్థానం, రోజా ద్వితీయ స్థానం, నీలావతి తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం వీరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, రామస్వామి, అశోక్ రెడ్డి, నాగసుందరి, కనకదుర్గ, సుజాత, వెంకటనారాయణ, సుజాత, మాధవి, ఆచారి ఉన్నారు.

గణితశాస్త్రంలో పట్టుసాధించాలి

కడ్తాల్ : విద్యార్థులు గణితశాస్త్రంలో పట్టుసాధించాలని మండల విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మండల స్థాయి పోటీ పరీక్షల్లో తెలుగు మీడియం నుంచి ముగ్గురు, ఇంగ్లిష్ మీడియం నుంచి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జంగయ్య, అరుణ, గణితశాస్త్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యాథమెటిక్స్ ట్యాలెంట్ టెస్టు

మొయినాబాద్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో మ్యాథమెటిక్స్ ట్యాలెంట్ టెస్టు నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ, మాడల్ పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. మండలంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు చెందిన విద్యార్థులు 27 మంది, తెలుగు మీడియానికి చెందిన విద్యార్థులు 18 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మానస, స్వరూప, ద్వితీయ స్థానంలో బాకారం జిల్లా సరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి హరివర్ధన్, సాధియా అంజుమ్, ఎన్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.సంజనా విజేతలుగా నిలిచారు. అదే విధంగా తెలుగుకు మీడియానికి చెందిన మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన జే చైతన్య ప్రథమ స్థానం, పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండీ అలీతాఫ్ రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.మణికుమారి, మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.వైష్ణవి విజేతలుగా నిలిచారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈ నెల 11న హయత్‌నగర్‌లోని ఎన్‌వీవైఎన్‌వైఎస్ యాదవ్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సిద్ధం శ్రీనివాస్ తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, విద్యా శాఖ మండల నోడల్ అధికారి మల్లయ్య పాల్గొన్నారు.

కడ్తాల్ : గణితశాస్త్రం పోటీ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఆమనగల్లు : విద్యార్థులతో మండల విద్యాధికారి పాండు, ఉపాధ్యాయులు

బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి చేయండి

బ్రిడ్జి రోడ్డులో గుంతలను పూడ్చివేత పనులు పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 9 : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ బ్రిడ్జితో పాటు బ్రిడ్జి కింద పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. ఈ పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల వర్షపు నీరు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తాత్కాలికంగా జేసీబీ సాయంతో కాలువ తీసి నీటిని మూసీ వాగులోకి పంపించారు. అలాగే బ్రిడ్జిపై పడ్డ గుంతల్లో కంకర పోయించారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారి రమేశ్‌తో మాట్లాడి పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. స్పందించిన ఆఫీసర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనుల్లో జాప్యం జరుగుతోందని, త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న సీఐ కాంతారెడ్డి, డీఐ రమేశ్‌నాయుడు, ఎస్ఐ సతీశ్

షాబాద్, డిసెంబర్ 9: మహిళ మెడలో నుంచి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... కొందుర్గు మండలంలోని చిన్న ఎల్కిచర్ల గ్రామానికి చెందిన లక్ష్మి ఈ నెల 4న మండలంలోని ముద్దెంగూడ గ్రామానికి తన బంధువుల వద్దకు వెళ్లేందుకు చిన్నఎల్కిచర్ల బస్టాప్ వద్ద నిలబడింది. అటు వైపుగా వెళ్తున్న ఎలికట్ట గ్రామానికి చెందిన జక్కుల శివలింగం నేను కూడా షాబాద్ వైపు వెళ్తున్నానని చెప్పి ఆమెను తన బైకుపై ఎక్కించుకున్నాడు. షాబాద్‌లోని ఆన్‌మోల్ గార్డెన్ వద్దకు రాగానే ఆమె మెడలో ఉన్న తులం బంగారాన్ని లాక్కొని పారిపోయాడు. బాధితురాలు షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఆదివారం శివలింగంను అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో నిందితుడి వద్ద తులం బంగారం, ఒక సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వివరాలు వెల్లడించిన వారితో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు, ఎస్ఐ సతీశ్ ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 9: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. షాద్‌నగర్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నషాముక్త్ భారత్ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుశీల, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సేవా ప్రముఖ్ శివశంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు కమలాకర్, రమేశ్, వంశీ, బాలబ్రహ్మచారి, మల్లికార్జున్, గిరి, సందీకుమార్, ఋషికేష్, వినయ్, భాను, దిలీప్, సురేశ్, పవన్, చరణ్, చరణ్, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు మాజీ సర్పంచ్ ఎంపిక

శ్రీనివాస్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న బహుజన సాహిత్య అకాడమీ ఫౌండర్ రాధాకృష్ణ

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 9 : చేవెళ్ల మండల పరిధి రావులపల్లి గ్రామ మాజీ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కేసారం శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ఉత్తమ సర్పంచ్ అవార్డును ప్రకటించింది. సోమవారం ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ ఫౌండర్, అధ్యక్షుడు రాధాకృష్ణ ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈనెల 15న ఢిల్లీలో జరిగే 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో కేసారం శ్రీనివాస్ అవార్డు అందుకోనున్నారు.

ఇబ్బందుల్లేకుండా కొనుగోలు చేపట్టాలి

ఆమనగల్లు, డిసెంబర్ 9: రైతులకు ఇబ్బందులు కలగకుండా వరిధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత సూచించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవోలు ఉన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.

\- మొయినాబాద్, డిసెంబర్9

కమ్ముకున్న మంచు దుప్పటి

చేవెళ్లటౌన్, డిసెంబర్ 9: ఉదయం 9 అవుతున్నా మంచుపొగ తొలగలేదు. సోమవారం చేవెళ్లను మంచు పొగ కమ్మివేయడంతో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు లైట్లు వేసుకుని ఇబ్బందులు పడుతూ వాహనాలు డ్రైవింగ్ చేశారు. ప్రతి రోజు ఉదయం 6గంటలకు సూర్యుడు దర్శనం ఇస్తుండగా, మంచు ప్రభావంతో ఉదయం 9 తర్వాత ప్రజలకు సూర్యుడు దర్శనం ఇచ్చాడు.

కడ్తాల్ : మండల కేంద్రంతోపాటు పరిధిలోని గ్రామాలు, తండాల్లో సోమవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. దీంతో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు కొనసాగించారు.



చేవెళ్లటౌన్: మంచు పొగలో లైట్ వేసుకుని వెళ్తున్న వాహనదారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని వాహనాల రాకపోకలు

చేవెళ్లలో కమ్మేసిన మంచు పొగ

పీఆర్సీ, డీఏలను విడుదల చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో సత్యనారాయణ, టీపీయూఎస్ సంఘం సభ్యులు

కడ్తాల్, డిసెంబర్ 9: ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా మహిళా ప్రముఖ్ సుమరంజిత డిమాండ్ చేశారు. ఉపాధాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్మాగ్రహ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎంఈవో సత్యనారాయణతో కలిసి సంఘం సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మండల అధ్యక్షుడు సంతోశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మండల గౌరవాధ్యక్షుడు భాస్కర్, మండల మహిళా ప్రముఖ్ మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

యాచారం, డిసెంబర్9: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదువుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫ్మార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు అన్నారు. మండలంలోని మేడిపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 9: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి నెల ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 99592 26287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు చామంతి
పూల సాగుపై శిక్షణ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 9: నేడు రాజేంద్రనగర్‌లో చామంతి పూల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం ఉందని ఉద్యానవన శాఖ అధికారిని కీర్తికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహిళలకు పంటపై అవగాహన ఉంటే వ్యవసాయ రంగంలో రాణించవచ్చన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం..
సీఎం అవివేకం

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 9 : ప్రజలకు చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సీఎం రేవంత్‌రెడ్డి అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్వీ (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శశిపాల్ తీవ్రంగా మండి పడ్డారు. సోమవారం ఆయన చేవెళ్లలో 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ఈ సందర్భంగా శశిపాల్ మాట్లాడుతూ.. చేయాల్సిన అభివృద్ధి పనులను పక్కనబెట్టి, అమలు, సాధ్యం కాని ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తూ, మభ్యపెడుతూ కాంగ్రెస్ సర్కార్ పబ్బం గడుపుతుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం యావత్ తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసలు రాష్ట్ర అభివృద్ధిపై నీకు సోయి ఉందా అని దుయ్యబట్టారు.

దివ్యాంగులకు
ఉచిత బస్‌పాసుల అందజేత

యాచారం, డిసెంబర్9: మండలంలోని గునగల్ గ్రామానికి చెందిన దివ్యాంగులకు హైదరాబాద్ డిపో-2 అధికారుల సహకారంతో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాసులను అందజేయడం సంతోషకరమన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..
ఒకరు మృతి

కొత్తూరు, డిసెంబర్ 9: ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మండలంలోని కొడిచెర్లలో ఆదివారం జరిగింది. కొత్తూరు ఎస్ఐ మురళీగౌడ్ వివరాల ప్రకారం.. బాలపూర్ మండలం మామిడిపల్లికి చెందిన బాలకృష్ణ (24) ఇద్దరు మహిళలను బైక్‌పై ఎక్కించుకొని జేపీ దర్గాకు వెళ్లి తిరిగి మామిడిపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా కొడిచెర్ల నుంచి షాద్‌నగర్ వెళ్తున్న కారు ఆనంద్ మెటల్స్ వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలకృష్ణ, ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వారిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలకృష్ణ మృతిచెందాడు. కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఆదిబట్ల, డిసెంబర్ 9: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాదర్గుల్ ప్రాంతంలో సోమవారం జరిగింది. ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం 40 సంవత్సరాలు కలిగిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చూడగా, వ్యక్తి శరీరం ఉబ్బిపోయిందని, తాను ఆత్మహత్య చేసుకుని ఒక రోజు గడిచి ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

షాబాద్, డిసెంబర్ 9: నేటి నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ మాడల్ స్కూల్‌లో క్రీడల నిర్వహణ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలను షాబాద్ మాడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. మండల స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. 10న వాలీ బాల్, 11న కబడ్డీ, 12వ తేదీన ఖోఖో పోటీలు, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారులకు బహుమతులతో పాటు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు సీఎం కప్ షాబాద్ మండల ఇన్‌చార్జి పీడీ బాబయ్య 8008778084లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.